# మారిన మనసు

-ఆదుర్తి బాల

డోర్ బెల్ మూడుసార్లు మోగింది. మంత్రపుష్పం చదువుతున్న సుభద్రమ్మ పనిమనిషిని తిట్టుకుంది. ఎందుకంటే మూడుసార్లు బెల్లు మోగితే పనిమనిషి వచ్చిందని అర్థం. తనూ, తన భార్యా ఆఫీసుకి వెళ్లిపోతే వంటరిగా వున్న తల్లి అపరిచితులు బెల్లు కొడితే గబుక్కున తలుపు తీయకుండా కొడుకు ప్రదీప్ చేసిన కోడ్ అది. ఆలోచన అయితే బాగానే వుందిగానీ పనిమనిషి ఆ టైమ్‌కి రావడమే నచ్చలేదు సుభద్రమ్మకి. ఆవిడ పూజ చేసుకునే టైమూ పనిమనిషి వచ్చే టైమూ ఒక్కటే మరి.

"వస్తున్నా మహాతల్లీ... పెంద్రాళే రమ్మని ఎన్నిసార్లు చెప్పిన నీ టైమ్ నీదే" దేవుడి ముందరున్న నైవేద్యాన్ని అవతల పెట్టి దేవుడి అలమార మూస్తూ పనిమనిషిని విసుక్కుంటూ వెళ్లి తలుపు తీసింది సుభద్రమ్మ. పనిమనిషి లోపలికి రాగానే తలుపు మూయబోతుంటే-

"పూజ అయిందా పెద్దమ్మగారూ" అంటూ ఎదురింటి మెర్సి పలకరించింది.

'హూ... శనివారం పొద్దుటే నీ దర్శనం... అపచారం' అనుకుంటూ మనసులోనే చెంపలు వేసుకుంది సుభద్రమ్మ.

మెర్సి ఇంకా స్నానం చేయలేదనుకుంటా... నలిగిన నైటీ, చెదరిన జుట్టుతో ఉన్న ఆమెను చూసి "నాకు పొద్దునే స్నానం చేసి పూజ చేసుకోవడం అలవాటు" కొంచెం అతిశయంగా అంది సుభద్ర. "అవునూ టైం పదవుతోందిగా ఇంకా స్నానం కాలేదూ?" మెర్సి వంక అదోలా చూస్తూ అంది సుభద్రమ్మ.

"ఇంకాలేదు పెద్దమ్మగారూ. ఇప్పుడే టిఫిన్ చేసాను. మీలాగా పెంద్రాళే స్నానం చేసే అలవాటు లేదు నాకు. నా స్నానం అయ్యేసరికి పదకొండు అవుతుంది" ఆ అమ్మాయి ఇంకా ఏదో చెప్పబోయింది.

"వస్తానమ్మా పనమ్మాయికి బట్టలు ఉతకడానికి వెయ్యాలి. దగ్గరుండి పని చేయించుకోవాలి. లేకపోతే ఈ పనివాళ్లు పని సరిగ్గా చేయరు" అంటూ తలుపేసేసింది సుభద్రమ్మ.

చుట్టుపక్కల ఎవరితోనూ కలుపుగోలుగా ఉండదు సుభద్ర. వారెవరూ తమ కులం కాదని, వారితో అంటీ ముట్టనట్టే వుంటుంది. ఆ మాటకొస్తే అసలు ఆ అపార్ట్‌మెంట్‌లోకి రావడమే ఆమెకి ఇష్టంలేదు. ఏదైనా ఇండివిడ్యువల్ హౌస్ తీసుకోరా అంది కొడుకు ప్రదీప్‌తో.

"రోజులు అసలే బాగాలేవు. నేనూ నీ కోడలు ఉమ ఆఫీసుకెళితే ఒక్కదానివీ ఉండాలికదా. అపార్ట్‌మెంట్ అయితే భయం ఉండదు. ఇండివిడ్యువల్ ఇల్లయితే నువ్వు ఇంటి దగ్గర ఎలా ఉన్నావో అని ఇంటికి చేరేవరకూ నాకు టెన్షన్" అంటూ అపార్ట్‌మెంట్ కొన్నాడు కొడుకు.

'వెధవ అపార్ట్‌మెంట్... ఇంటి యజమాని నుండి పనివాడు, పాకీవాడు దాకా అందరూ ఎంట్రెన్స్‌లోంచి రావాలి. రోజూ వచ్చే పనిమనిషి కూడా దేవతార్చన ముందు నుంచే నడిచి వెడుతుంది. మా కాలంలో ఇంత అనాచారం ఉందా? ఎక్కడో పెరట్లో బావి గట్టున పనిమనిషి గిన్నెలు తోమి బోర్లిస్తే అన్నీ మళ్లీ తొలిచి లోపలకు తెచ్చేది తను. మరి ఇప్పుడో... పనిమనిషి వంటింటి సింకులోనే గిన్నెలన్నీ తోమేస్తుంది. ఏదో ఛాదస్తం కొద్దీ తను మళ్లీ తొలుస్తుందిగానీ అదే తన కోడలైతే అలాగే వాడేస్తుంది. తనేదైనా చెప్పబోతే "మీది మరీ ఛాదస్తం అత్తయ్యా... హోటల్‌లో తినడంలేదా? వాడు పళ్లాలు, గ్లాసులూ శుభ్రంగా కడుగుతాడా ఏమైనా?' అంటుంది. వాళ్లకేం బయటకెళ్లొస్తారు. నలుగురితో కలసి పని చేస్తారు కాబట్టి తనలాగా పెద్ద పట్టింపులుండవు. టైంకి వండుకోవడం, సంపాదించడం అవే ముఖ్యం వాళ్లకి. తనకి మాత్రం ముళ్లమీద ఉన్నట్లే ఉంటుంది. పైగా ఇక్కడ వీళ్ల అపార్ట్‌మెంట్‌కి ఎదురుగా క్రిస్టియన్స్, పక్కన మరాఠీ కుటుంబం, అవతల వేరే కులం వాళ్లు. ఒక్కళ్లూ తమ కులం వాళ్లు లేనందుకు రోజూ విచారిస్తూనే వుంటుంది సుభ్రదమ్మ. వాళ్లతో కలిస్తే తన ఆచారం అడుగంటి పోతుందోనని వాళ్లతో అంటీ ముట్టనట్లు వుంటుంది. వాళ్ల పిల్లలెవరైనా ఆడుకుంటూ ఇంట్లోకొచ్చినా వాళ్ల తల్లులు అక్కడ లేకపోతే గుమ్మరిమి గడప బయటకి పంపించివేస్తుంది.

"నువ్విలా ఉంటే ఎలాగమ్మా? అందరితో కలసి ఉండాలి. ఒక్కర్తివే వుంటావు. ఎప్పుడేం అవసరం వస్తుందో మనకు తెలీదుగా. మన కులం కాకపోయినంత మాత్రాన వాళ్లు మాత్రం మనుషులు కారా?" అని కొడుకు హెచ్చరిస్తూనే వుంటాడు.

"పోనీలేరా.. ఎప్పుడో ఎదో అవసరమొస్తుందని ఇప్పట్నుంచీ అందర్నీ కలుపుకుని తిరగడం నావల్లకాదురా. అయినా రోజూ ఆ దేవుడికి అర్చన చేస్తున్నారుగా. ఏదైనా ఆపదొస్తే ఆయనే చూసుకుంటాడులే" అంటుంది సుభద్రమ్మ.

★★★

టీవీ చూస్తోంది సుభద్రమ్మ. పనిమనిషి ఇల్లు తుడుస్తోంది. ఇంతలో తలుపు చప్పుడైంది. తప్పదన్నట్లుగా లేచింది సుభద్రమ్మ. తలుపు తీయగానే అవతల ఇంట్లో వుంటున్న పదేళ్ల పాప ఆయేషా వచ్చింది. గిన్నెనిండా పాయసం పట్టుకుని తెచ్చి ఇచ్చింది.

"ఎందుకమ్మా ఇప్పుడు?" అంది సుభద్రమ్మ ఆ గిన్నె ముట్టుకోకుండానే.

"ఇవాళ నా బర్త్‌డే. మమ్మీ చేసింది" అంది ఆయేషా.

"అలాగా... ఆ టీపాయ్ మీద పెట్టి వెళ్లు"

అంది సుభ్రదమ్మ.

గిన్నెని టీపాయ్ మీద పెట్టి వెళ్లిపోతున్న ఆయేషాకి ఫ్రిజ్‌లో వున్న స్వీట్స్ పాకెట్ ఇచ్చింది ఆమె. ఆ పిల్ల వెళ్లిపోయాక "ఇదిగో మంగమ్మా' అంటూ పనమ్మాయిని పిలిచి "నీకు తెలుసుగా... మేం ఇలాంటివి తినమని. ఆ పాయసం నీ గిన్నెలో పోసుకుని గిన్నెను కడిగేయి. నువ్వేళ్లేటప్పుడు ఆ గిన్నె ఆ పాపా వాళ్లింట్లో ఇచ్చేసిపో'' అంది.

పైకి తేలుతున్న జీడిపప్పు, కిస్‌మిస్‌లతో చిక్కటి పాలతో చేయబడిన సేమ్యా పాయసం చూడగానే మంగమ్మ కళ్లు మెరిసాయి.

"తమలాటి పద్ధతిగలోరు అలాటియి తినరని నాకు తెలవదా అమ్మా" అంటూ మంగమ్మ ఆ పాయసం తన గిన్నెలో పోసుకుంది.

"నీ మొహం ఇప్పుడేం చూసావ్ నా మడీ ఆచారమూను. నిప్పులు కడిగే వంశం మాది'' మా తాతలు నేతులు తాగారు మా మూతి వాసన చూడండి అన్న చందంగా గొప్పగా చెప్పింది సుభద్రమ్మ.

★★★

ఆ రోజు పొద్దుట్నించీ ముసురు, వాన. ఆకాశమంతా మబ్బులు కమ్ము కున్నాయి. రాత్రి తొమ్మిదవుతున్నా కోడలు ఇంకా ఇంటికి రాలేదు.



సుభద్రమ్మ మనసు ఆందోళనతో నిండిపోయింది.

"ఏరా... ఇంకా ఉమ ఇంటికి రాలేదు. నాకు భయంగా ఉంది. ఆఫీసుకు ఓసారి ఫోన్ చేసి కనుక్కో" అంది సుభద్రమ్మ కంగారుపడుతూ.

"వర్షం తగ్గేవరకు ఎక్కడైనా ఆగి వుంటుంది. కంగారుపడకు. వస్తుం దిలే" తనకీ లోపల కంగారుగానే ఉన్నా అది బయట పడకుండా తల్లికి ధైర్యం చెబుతున్నట్లుగా అన్నాడు ప్రదీప్. హూ... ఏం మనుషులో ఏమో... ఇంటి దగ్గర వాళ్లు కంగారుపడతారని తెలీదూ దానికి. ఎందుకు లేట యిందో ఓసారి ఫోన్ చేసి చెప్పవచ్చుగా. కోడల్ని విసుక్కుంటూ బాల్క నీలో బాల్కనీలో నుంచుని వచ్చిపోయే వాహనాలను చూస్తోంది సుభ ద్రమ్మ. తమ కాంపౌండ్ గేటు ముందు ఆగిన ఆటోలోంచి దిగిన కోడల్ని చూసాక కుదుటపడింది ఆమె మనసు. గబగబా వెళ్లి తలుపు తీసింది.


"ఏమిటి ఇంత ఆలస్యం అయింది?" గుమ్మంలోనే అడిగేసింది.

"మా కొలీగ్ ఒకాయనకి హార్ట్ ఎటాక్ వచ్చిందత్తయ్యా. ఆయనని



## కోపమెందుకో?

టబూకి నాగార్జునతో మంచి దోస్తానా వున్న సంగతి చాలాకాలంగా పాపులర్ అయింది. ఇటీవల వీళ్లిద్దరూ ముంబాయిలోని ఓ ఫ్యాషన్ షోకి కలిసి హాజరు కావడం పెద్ద వార్తయి కూర్చుంది. అయితే ఇలాంటి పనికి మాలిన సంగతుల్ని ఊరికే ఎందుకు ప్రచారం చేస్తారో అర్థం కావడంలేదని కోపంగా అంది టబూ. కలిసి నలుగురి దృష్టిలోకి వచ్చినప్పుడు లేదుగానీ దాన్ని చెప్పుకుంటే మాత్రం కోపమొచ్చింది అంటున్నారు సినీజనాలు.




హాస్పిటల్‌లో చేర్పించి వచ్చేసరికి లేటయింది" ఇంకా అక్కడే నుంచుంటే ఇంకెన్ని ప్రశ్నలు వేస్తుందోనని అత్తగార్ని తప్పించుకుని గబగబా టవల్ అందుకుని బాత్రూంలోకి వెళ్లిపోయింది ఉమ స్నానం చేసి రావడానికి.

***

ఆ రోజు రాత్రి దగ్గు రావడంతో కాసిని మంచినీళ్లు త్రాగి పడుకుందా మని లేచింది సుభద్రమ్మ. కొడుకు కోడలు ఇంకా నిద్ర పోలేదులా వుంది. వారి గదిలోంచి వస్తున్న మాటలు ఆమె చెవిన పడ్డాయి.

"ఎవరికి హార్ట్ ఎటాక్ వచ్చింది? ఏ హాస్పిటల్‌లో చేర్చారు?" అడుగు తున్నాడు ప్రదీప్.

"హార్ట్‌ఎటాక్ వచ్చిన మాట నిజమే. కానీ హాస్పిటల్‌లో చేర్చడం అబద్ధం" అంటోంది ఉమ.

"అదేమిటి అమ్మతో అలా చెప్పావు?" ప్రదీప్ అడిగిన ప్రశ్నకు సుభద్ర మ్మలో కుతూహలం పెరిగిపోయింది కోడలు ఏం చెబుతుందోనని.

"మరేం చేయమంటారు? మా కొలీగ్ రామశాస్త్రి అని ఒకాయన ఉన్నా డులెండి. మరీ పెద్ద వయసేం కాదు యాభై దాటాయంతే. హార్ట్ అటాక్ వచ్చి ఆఫీసులోనే పోయాడు. హాస్పిటల్‌కు తీసుకెళ్లే టైమ్ కూడా లేదు పాపం. ఆఫీస్ స్టాఫ్ అంతా అక్కడే ఉండి డెడ్‌బాడీని ఇంటికి తీసుకువెళ్లే ఏర్పాటు చేసారు. నేనూ ఉండిపోయాను. ఆ సంగతి చెప్తే అత్తయ్య నన్ను కట్టుకున్న బట్టలతోపాటు హాండ్ బాగ్ కూడా తడిపించి తలారా స్నానం చేస్తేగానీ ఊరుకోరు. నాకసలే తలస్నానం పడదు. జలుబు, తుమ్ములు పట్టుకుంటాయి. అలాంటిది ఈ ముసురు, వర్షంలో తలమీద స్నానం చేస్తే అదీ ఈ చలీ రాత్రివేళ వారంరోజులు పడకేయడం ఖాయం. అందుకే ఆవిడ ఇంకేం ప్రశ్నలు వేస్తుందోనని గబగబా బాత్రూంలోకి వెళ్లిపో యాను" అంది ఉమ.

"పోనీలే మంచి పని చేసావు. ఎవరు ఎంతలా చెప్పినా అమ్మ మారదు, ఆవిడ చాదస్తమూ మారదు" అంటున్నాడు ప్రదీప్.

కొడుకూ కోడలి సంభాషణ విన్న సుభద్రమ్మకి ఒళ్లు మండిపోయింది. 'హూ...కలికాలం...చివరికి అబద్ధాలు చెప్పే స్థితికి దిగజారిపోయారు. మడీ ఆచారం మంటగలసిపోతున్నాయి. సంపాదించడం, తినడం, తిరగడం ముఖ్యం వీళ్లకి' తన మంచం మీదకొచ్చి పడుకుంటూ అనుకుంది ఆమె.

***

కొడుకూ కోడలు ఆఫీసుకు వెళ్లగానే ఇల్లు పసుపు నీళ్లతో శుద్ధి చేసింది. దుప్పటి, కర్టెన్లు తడిపింది పనమ్మాయి చేత ఆరేయించింది. తలారా స్నానం చేసింది. అప్పుడుగానీ ఆవిడ మనసు శాంతించలేదు. పొద్దున వండిన వంటంతా పనమ్మాయికి ఇచ్చి తను మళ్లీ వండుకుంది. అన్నం తిని పడు కునేసరికి మధ్యాహ్నం రెండు దాటింది. డోర్ బెల్ మోగుతుంటే మెలకువ వచ్చింది ఆమెకి. మంచి నిద్రలో లేచిందేమో.... ఆ నిద్ర కళ్లతోనే తలుపు తీసింది. ఎదురుగా ఇద్దరు ఆగంతకులు.

"ఎవరూ?" అని సుభద్రమ్మ అడిగేలోపే ఆవిడను నెట్టుకుంటూ లోప లకు వచ్చేసారు. ఆ చుట్టుపక్కలవాళ్లు భోజనాలై పడుకున్నారేమో అపార్ట్ మెంట్ అంతా నిశ్శబ్దంగా ఉంది. వచ్చినవాళ్లలో ఒకడు లోపలకు రాగానే తలుపు మూసి బోల్టు పెట్టేసాడు. ఇంకొకడు జేబులోంచి కత్తి తీసాడు. సుభ ద్రమ్మకు పై ప్రాణాలు పైనే పోయాయి. 'అరిచావో చంపేస్తాను' సుభద్ర మ్మను బెదిరించాడు వాడు. ఇంకొకడు ఆవిడ మెడలో చంద్రహారం లాగే సాడు. చేతి గాజులు లాగేసాడు. ఆ గాజులు తీయడంలో కోసుకుని రక్తం కూడా వచ్చింది. 'తియ్ బీరువా తాళాలు' సుభద్రమ్మను మెడమీద కత్తి

ఆనిస్తూ కర్కశంగా అన్నాడు ఒకడు. కొడుకూ కోడలు జీతాలు తెచ్చి బీరువాలో దాచారు ముందురోజే. నెలరోజుల కష్టార్జితం కళ్లముందే దోచుకుపోతుంటే ప్రాణం కొట్టుకుపోయింది. భయంతో గుండె దడా, ఆయాసం వస్తోంది. టెన్షన్‌తో తల పగిలిపోయేలా వుంది. అరిస్తే ఎక్కడ ప్రాణాలు తీస్తారోనని నోరెత్తకుండా ఉండిపోయింది. నీరసం కమ్ముకు రాగా స్పృహ కోల్పోతున్నట్లు అనిపించింది. తరువాత ఏమయిందో ఆమెకు తెలియదు.

★★★

"పెద్దమ్మగారూ! కళ్లు తెరవండి" ఆప్యాయంగా పిలుస్తోందో గొంతు.

"అమ్మా లేవండి..." పక్క వాటాలోని మరాఠీ చాచి గొంతులా అనిపించింది సుభద్రమ్మకి. మెల్లగా కళ్లు విప్పి చూసింది. ఎదురుగా కొడుకూ కోడలూ, ఆ ప్రక్కనే ఎదురింటి మెర్సీ భర్త డేవిడ్, ఆ పక్కన వాచ్‌మెన్ మస్తాన్. అందరూ ఆతృతగా తన వంకే చూస్తున్నారు. గాయపడిన తన చేతులకి ఆయింట్‌మెంట్ రాస్తోంది ఆయేషా.

"ఈ వేడి పాలు కాస్త తాగండి పెద్దమ్మగారూ" పాలు తెచ్చి సుభద్రమ్మ చేతికిచ్చింది మెర్సి. ఆమెకు కులమతాలు గుర్తుకు రాలేదు. తనమీద వాళ్లు కురిపిస్తున్న ఆప్యాయతకి కృతజ్ఞతగా ఆమె కళ్లల్లో నీరు తిరిగింది.

"భయపడకండి...మీకేమీ కాలేదు" అనునయంగా అన్నారెవరో.

"వాళ్లు.. ఆ రౌడీ వెధవలు" స్ఫురణకు వచ్చినట్లుగా అన్నదామె.

"వాళ్లను పట్టుకుని పోలీసులకు అప్పజెప్పాం" అన్నాడు డేవిడ్.

" అయితే మా డబ్బూ, బంగారం..." అందామె అనుమానంగా.

"అన్నీ దొరికాయి డేవిడ్‌గారి దయవల్ల" అన్నది కోడలు ఉమ.

"అసలేం జరిగింది?" ఉమ చెప్పడం మొదలుపెట్టింది.

"డేవిడ్‌గారు ఊరి నుండి వస్తున్నారట. వీధి మలుపు తిరిగి వస్తుండగా మన గేట్ ముందు బైక్ ఆపుకుని ఇద్దరు వ్యక్తులు సెల్లార్‌లోకి రావడం చూసారుట. ఎవరి తాలూకు మనుష్యులో అనుకున్నారట మొదట. కానీ నెంబరు ప్లేట్‌లేని బైక్‌ను చూసేసరికి ఆయనకు అనుమానం వచ్చిందిట. ఆయన మెట్లెక్కి పైకి వచ్చి మన కారిడార్‌లోకి రాగానే వాళ్లిద్దరూ మన అపార్ట్‌మెంట్‌లోకి రావడం చూసారుట. వచ్చినవాళ్లు ఇంటి ముందు చెప్పులు విడవకపోవడం, పైగా వచ్చీ రాగానే తలుపు మూసుకుపోవడం అంత దూరం నుంచి గమనించగానే ఆయన అనుమానం బలపడిందిట. తలుపు కొట్టి పిలుద్దామనుకున్నారుట. కానీ అలా చేస్తే ఆ ఆగంతకులు మీకేమైనా హాని తలపెడతారేమోనని సైలెంట్‌గానే ఇరుగుపొరుగువారిని పిలుచుకువచ్చారుట. అందరూ మన గుమ్మం ముందే చప్పుడు చేయకుండా వెయిట్ చేసారుట. డబ్బు, బంగారం మూడగట్టుకుని ఆ రౌడీలు బయటకు రాగానే వాచ్‌మెన్ సాయంతో పట్టుకున్నారు. పాపం ఆ దొంగ వెధవలతో తలపడినప్పుడు జరిగిన ఘర్షణలో మస్తాన్‌కీ, డేవిడ్‌గారికీ గాయాలయ్యాయి" ఉమ చెప్పడం పూర్తి చేసింది.

ఇన్నాళ్లూ కులాలు, మతాలు పేర తనకు పట్టిన మూర్ఖత్వం వదిలిపోయినట్టనిపించింది సుభద్రమ్మకి. ఎవరి కులం వాళ్లకి ఎక్కువేగా మరి. ఎవరికి వారు అలా అనుకుంటే ఎవరికెవరు మిగలరు. ఒకరికి ఒకరు అనుకుంటే మనకోసం ఎవరో ఒకరు మిగలకపోరు. అంతరాత్మ ప్రబోధంలా అనిపించింది సుభద్రమ్మకి.

"బాబూ... చిన్నవాడివని ఊరుకున్నానుగానీ నీవు మాకు చేసిన సహాయానికి దణ్ణం పెట్టాలనిపిస్తోంది" అన్నదామె డేవిడ్‌ను ఉద్దేశించి.

"అయ్యో అంత మాట అనకండమ్మా. మీరు మాకు తల్లిలాంటివారు" అభిమానంగా అన్నాడతను.

★★★

సర్వమత సమ్మేళన సభలా ఉంది సుభద్రమ్మగారిల్లు. చుట్టుపక్కల వారినందరినీ పిలిచి తన స్వహస్తాలతో వంట చేసి అందరికీ భోజనాలు పెట్టింది సుభద్రమ్మ.

'అమ్మ మారిపోయింది...' సంతృప్తిగా అనుకున్నాడు ప్రదీప్.

కాలం మారిపోతోంది. మనుష్యులలో నేర ప్రవృత్తి పెరిగి దోపిడీలు పెరిగిపోయాయి. మనుష్యులు భద్రత కోరుకుంటున్న నేపథ్యంలో అపార్ట్‌మెంట్ కల్చర్ ప్రత్యామ్నాయంగా నిలిచింది. పూర్వకాలంలో ఒక కుటుంబం ఉండేంత స్థలంలో ఇప్పుడు నాలుగైదు కుటుంబాలు నివశిస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో ఇమడడానికి సుభద్రమ్మలాంటి పాత తరం వారికి ఘర్షణ తప్పదు. విశాలమైన పెరడు, వేపచెట్టున్న లోగిలిలో పెరిగినవారు ఈ ఇరుకు గదులకే పరిమితమవడం కష్టమే. ఏదో ఒక అనుభవమో జరిగితేతప్ప వారు మారలేరు మరి!

★



## అంతరించిపోతున్న కిరిబాటి

ప్రముఖ భారతీయ వాతావరణ శాస్త్రజ్ఞుడు పచౌరి పరిశోధనల ప్రకారం భూవాతావరణ మార్పులవల్ల ప్రపంచంలోని సముద్రాల నీటిమట్టం గత శతాబ్దంలో 10 నుంచి 20 సెం.మీ పెరిగిందిట. ఇక 21వ శతాబ్దంలో 9 నుంచి 88 సెం.మీ మట్టం పెరిగే ప్రమాదముందిట. ఈ కారణంగా ఫసిపిక్ మహాసముద్రంలో ప్రస్తుతం లక్షమంది నివశిస్తున్న కిరిబాటి ద్వీపం వచ్చే 10 సంవత్సరాల్లో సముద్రంలో పూర్తిగా మునిగిపోతుందిట. అలాగే 20-40 సంవత్సరాల్లో మాల్‌దీవుల్లాంటి అనేక ద్వీపాలు అంతరించిపోతాయిట.

**-తటవర్తి**

